## క్లుప్తంగా

### వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి,అమ్మవార్లకు నిత్య పూజలు గావించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండల కేంద్రం తోపాటు ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల తదితర గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయస్వామికి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### మాన్యం భూములకు కౌలు వేలం



ఎల్లావత్తులలో కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తులలో లక్ష్మీనరసింహ్మస్వామి, నాగేశ్వరస్వామివారి మాన్యం భూములకు శనివారం దేవాదాయ శాఖ ఈఓలు నర్సయ్య, చంద్రుడు పోలీసు బందో బస్తు మధ్య కౌలు వేలంపాట నిర్వహించారు. ఈఓలు తెలిపిన వివరాల మేరకు దాదాపు 50 ఎకరాలకు వేలం నిర్వ హించగా రూ.5.70లక్షలు ఆదాయం వచ్చింది. గతేడాది అదనంగా రూ.1.14లక్షల ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమోహన్, ఎంపీటీసీ కాశన్న, పంచాయతీ కార్యదర్శి పాములేటి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని సీపీఐ నంద్యాల జిల్లా సమితి నాయకులు అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల అయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భాస్కర్, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

### జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలి



బేతంచెర్లకు వెళ్తున్న ఎస్టీయూ నాయకులు

చాగలమర్రి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. శనివారం బేతంచెర్లలో నిర్వహించే జిల్లా ఎస్టీయూ సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు మస్తాన్‌బాషా, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు ఆధ్వర్యంలో సభ్యులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, కౌన్సిలర్ సురేషప్పా, కన్వీనర్ నాగేంద్ర కుమార్, ఆర్థిక కార్యదర్శి మాబుహూసేన్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనం కొంటున్నారా.. జరభద్రం

- కొనుగోలు విషయంలో జాగ్రత్తలు అవసరం
- అన్ని సక్రమంగా ఉన్నాకే నగదు లావాదేవీలు
- ఒప్పంద పత్రాలతో విక్రయదారుకే నష్టం
- 29, 30 ఫారాల్లో సంతకాలు తప్పనిసరి



నంద్యాల(న్యూటౌన్): సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసే సమయంలో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ ఉంటే చాలని కొనేస్తుంటారు. ఆ తర్వాత చిక్కుల్లో పడి ఇబ్బందులు పడతారు. ఆ వాహనంపై ఏవైనా చలానాలు ఉన్నాయా అని చూసుకోకుండా కొనుగోలు చేస్తే ఆ భారం కూడా మీపై పడినట్లే. ఇటీవల కాలంలో ఓ యువకుడు ద్విచక్రవాహనాన్ని వేరే వ్యక్తి వద్ద కొనుగోలు చేశాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనానికి సంబంధించిన పత్రాలు అతడి పేరుపై ఉండకపోవడం.. సంబంధిత యజమాని అందుబాటులో లేకపోవడంతో ఆ వాహనాన్ని స్టేషన్‌కు తరలించి పూర్తి వివరాలు సేకరించారు. కొత్త వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అదే సందర్భంలో పాత వాహనాల విక్రయాలు కూడా అంతే జరుగుతున్నాయి. ఇతరులకు విక్రయించినట్లు సేల్ అగ్రిమెంట్ ఇతర పత్రాలన్నీ సరిగ్గా చూసుకోకుంటే ఆ తర్వాత లేనిపోని చిక్కుల్లో పడాల్సి వస్తుంది. ఇటీవల పోలీసులు ఈ-చలానా విధిస్తుండడంతో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత వాహనాన్ని అమ్మిన సమయంలో చిన్న బాండు పేపర్‌తో అమ్మకం గురించి ఒప్పందాలు చేసుకుని విక్రయిస్తారు. వాహనాన్ని కొన్న వ్యక్తి తన పేరుపై రిజి స్ట్రేషన్ చేసుకోకుండా అలాగే నడిపిస్తే అమ్మిన వ్యక్తికి ఈ-చలానా భారం పడుతుంది. ఈ విషయాన్ని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వినే పరిస్థితి ఉండదు. కాగితాలను చూస్తేగాని నమ్మరు. అలాంటప్పుడు 'సేల్ డీడ్ అగ్రిమెంట్ కాగితాలు ఉండడం మంచిది. సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అమ్మిన వారేగాక కొన్న వారు కూడా చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

**జోరుగా మారు బేరాలు..**

నగరాలు, పట్టణాలతో పాటు ఇటీవల మండల స్థాయిలో కూడా వాహనాల అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మధ్యవర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. కొనుగోలు చేసిన వారు వారం, పది రోజుల్లోపు యాజమాన్య హక్కులను మార్చుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలస్యం చేస్తే అధికారులు జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**29, 30 ఫారాలే ముఖ్యం..**

వాహనం కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకోవడం చాలా ముఖ్యమని అధికారులు సూచిస్తున్నారు. వాటితో పాటు ఫారం 29 రెండు కాపీలు, ఫారం 30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాత వాహనం అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరో వాహనం కొన్నప్పుడు ఆదనపు ఇబ్బందులు ఎదురుకావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో ఎక్కువ పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు. వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరువైపులా యాజమాన్య హక్కులను మార్చుకోవాలి,

**కొన్న వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి**



పాత వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకుని పేరు, చిరునామా మార్చుకోవాలి. ఇది చాలా ముఖ్యం. తప్పనిసరిగా కొనుగోలుదారుడు చూసుకోవాలి. లేకపోతే అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేకపోలేదు. వాహనానికి సంబంధించి ఏదైనా ప్రమాదం జరిగినా, ఏదైనా ఘటన జరిగినా వాహనదారుడు కూడా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించాలి.

–శివారెడ్డి, డీటీఓ, నంద్యాల

### హెచ్‌ఎంలకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): గత వేసవి సెలవుల్లో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి సప్లిమెంటరీ పరీక్షల ఫీజు వసూలు, నాడు-నేడు పనుల కోసం విధులకు హాజరైన ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం కోరారు. పాఠశాలలకు రెండేళ్లుగా నిర్వహణ గ్రాంట్ విడుదల చేయడం లేదని, సొంత డబ్బు ఖర్చు పెట్టుకున్నామని తెలిపారు. ఈ ఏడాది అయినా నిధులు మంజూరు చేయాలని కోరారు. జీవోనెం.117 రద్దు చేసి ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన 3, 4, 5 తరగతులు తిరిగి ప్రాథమిక పాఠశాలలు కొనసాగించాలన్నారు. అలాగే ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మీడియం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ప్రతిభ చాటిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): నాసా ఒరియంటేషన్ ప్రాజెక్టు పరీక్షలో తమ విద్యార్థులు ప్రతిభ చాటారని చైతన్య స్కూల్ ప్రిన్సిపాళ్లు సౌజన్య, దేవేంద్ర అన్నారు. శనివారం 28 మంది విద్యార్థులను అభినందించారు. 9 మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, ఆర్ఐ చౌదరి, ఏఓ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రమణయ్య

చాగలమర్రి: మొహర్రం పండుగ వేడుకలు కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతవరణంలో, శాంతియుతంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ రమణయ్య సూచించారు. ఈ మేరకు శనివారం పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. ఏవరైనా గోడవలు సృష్టించినా, అత్యుత్సాహం ప్రదర్శిస్తూ రెచ్చగొట్టేలా వ్యవహరించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ప్రభుత్వ ఖాజీ ముల్లా యూనుస్‌బాషా, శ్రీలాల్‌స్వామి కమిటీ అధ్యక్షుడు ముల్లా జిలాన్ బాషా, కోశాధికారి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, మెంబర్లు ముల్లా షఫీ, ముల్లా షంషీర్, ముల్లా షాకీర్, ముల్లా ఖలీల్, ముల్లా షంపీర్, ముల్లా అజీం, బీసీ సంఘం నాయకులు సల్లా నాగరాజు, గుత్తి నరసింహుడు,ఆర్యవైశ్య సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన పీర్లు



గాంధీచౌక్‌లో కొలువుంచిన పీర్లు

నంద్యాల(వ్యవసాయం): మొహర్రం వేడుకల్లో భాగంగా పట్టణంలోని పలు పీర్ల చావిడీ మకాన్లలో పీర్లు కొలువుదీరాయి. కులమతాలకు అతీతంగా ప్రజలు కలిసికట్టుగా ఈ పండుగ జరుపుకుంటారు. శనివారం పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలి వీధిలో బీబీ ఫాతిమా, గాంధీచౌక్‌లో హుసేన్ ఆలం, ఇమామ్, దస్తగిరి, జుమ్మా మసీదు వద్ద వెలసిన ఇమామ్ హుసేన్‌లను ముజావర్లు ప్రత్యేకంగా తయారు చేసిన పూలదండలు, తమలపాకుల దండలు, బాసికాలు, దట్టీలను సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

**భక్తిశ్రద్ధలతో హురేషహీద్ పీర్ల ఊరేగింపు**

చాగలమర్రి: మొహర్రం పండుగ వేడుకల్లో భాగంగా ఆరవ రోజు శనివారం రాత్రి చాగలమర్రిలోని నాయీ బ్రాహ్మణ వీధిలో కొలువు దీరిన శ్రీహజ్రత్ హురే షహీద్ పీర్ ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య సాగింది. నాయీ బ్రాహ్మణ వీధి నుంచి ప్రారంభమైన పీర్ల దేవుళ్ల ఊరేగింపు మెయిన్ బజార్ మీదుగా సాగింది. దారిపొడవునా భక్తులు హురేషహీద్ పీరుకు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అరబ్ మస్జీద్, చిన్నమకానంలోని శ్రీలాల్‌స్వామి వద్ద ఫాతేహాలు నిర్వహించారు. రచ్చబండ, పెద్దమకానం నుంచి మెయిన్ బజార్ మీదుగా హురేషహీద్ పీర్లు కొనసాగింది. ఆదివారం తెల్లవారు జామున నాయీ బ్రాహ్మణ వీధిలోని పీర్లచావిడికి పీర్లదేవుళ్లు చేరుకుంటారు.

## గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల(న్యూటౌన్): జీపీఎస్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం సమంజసం కాదని, వెంటనే రద్దు చేయాలని ఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలనేది ఉద్యోగ, ఉపాధ్యాయుల అకాంక్ష అని పేర్కొన్నారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణమే అమలు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో కేషాలు నాయక్, ప్రభాకర్, కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## జగజ్జననీ నమోస్తుతే



ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు



అమ్మవారికి చీర, సారెను సమర్పిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జగజ్జననీ ఆలయంలో శనివారం మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి చీర, సారె సమర్పించారు. జగజ్జననీ అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చన, రాహుకాల పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కోలాటం, నృత్యాలు చేస్తూ భక్తిభావాన్ని చాటారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

## మేఘమా..గగనాన్ని వీడుమా!



మినుము పంటపై ఊరిస్తున్న మేఘాలు

దొర్నిపాడు:తొలకరి వర్షాలు అదనులో కురువడంతో రైతులు ముందస్తు పంటగా మినుము, మొక్కజొన్న పంటలను విస్తారంగా సాగు చేశారు. అయితే మూడు వారాల నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారం ఇలానే ఉంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మేఘమా గగనాన్ని వీడుమా అంటూ రైతులు వేడుకొంటున్నారు.

### అర్హులైన రైతులందరికీ కౌలు కార్డులు

ఉయ్యాలవాడ : ప్రభుత్వం అర్హులైన కౌలు రైతులందరికీ కౌలు కార్డు మంజూరు చేస్తుందని ఏఓ రాజేంద్రకుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కౌలు ఒప్పంద అగ్రిమెంట్‌తో పాటు భూయజమాని, కౌలు రైతు ఆధార్ కార్డు, ఫొటో, 1బి జిరాక్స్, పొలం పాస్ బుక్ జిరాక్స్‌తో స్థానిక వీఆర్‌ఓ వద్ద దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న కౌలు రైతుల వివరాల పరిశీలన అనంతరం కౌలు కార్డు మంజూరు చేస్తామని చెప్పారు.

### దోషులను కఠినంగా శిక్షించాలి



గాంధీచౌక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): బాలిక హత్య దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణంలోని గాంధీచౌక్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని ముచ్చుమర్రి గ్రామంలో మైనర్ బాలికను అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారం రోజులు అయినప్పటికీ ఇంత వరకు మృతదేహాన్ని గుర్తించకపోవడం పోలీసు వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబాఫక్రుద్దీన్, భాస్కర్, ధనుంజయుడు, మహిళా సమాఖ్య నాయకురాలు మున్ని తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం సమీపంలో శనివారం కారు,బైకు ఢీ కొనడంతో బైక్‌పైనున్న సున్నిపెంటకు చెందిన శ్రీను గాయపడ్డాడు. ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.సెలవు రోజు లు కావడంతో భక్తులు తరలి రావడంతో వాహనాల సంఖ్య పెరిగిపోయి డ్యాం ఘాట్‌లో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న సున్నిపెంట టూటౌన్ సీఐ రమేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్ది గాయపడిన శ్రీనును సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

### పచ్చగడ్డితో పశువులకు రోగనిరోధక శక్తి

మహానంది: దాణా కంటే పచ్చగడ్డిని పశువులకు మేతగా అందిస్తే వాటిల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని బండిఆత్మకూరు మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనూష తెలిపారు. శనివారం సంతజూటూరు గ్రామంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన పశుగ్రాసంతో పాడిపశువుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. పాడి రైతులకు పశు పోషణ, జాగ్రత్తలపై అవగాహన ఎంతో ముఖ్యమన్నారు. పాడిరైతులు తమకు ఉన్న పొలంలో కొద్ది విస్తీర్ణంలో పశుగ్రాసం సాగుకు మొగ్గు చూపాలన్నారు.

### పెద్దకంబలూరులో విష జ్వరాలు



జ్వరంతో మంచం పట్టిన బాలుడు

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు ఎస్సీ కాలనీలో విష జ్వరాలు విజృంభించాయి. కాలనీకి చెందిన ప్రభాస్, రమణమ్మ, మానిక్యమ్మ, విజయమ్మ, లక్ష్మీనరసమ్మ, సుబ్బమ్మ, వెంకటసుబ్బయ్య, రమణయ్య, ఆనందు, బుజ్జి తదితరులు జ్వరంతో ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా వృద్ధులు, చిన్న పిల్లలు విషజ్వరాలతో మంచంపట్టారు. కాలనీలో విషజ్వరాలతో బాధపడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా హెల్త్ సెంటర్ ఉన్నప్పటికీ ప్రయోజనం శూన్యమన్నారు. తప్పని పరిస్థితుల్లో ఆర్‌ఎంపీలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ఆర్థిక భారంపడుతుందన్నారు. అయితే కాలనీ పక్కనే బయలు ప్రదేశంలో గుట్టలు గుట్టలుగా పేరుకపోయిన వ్యర్థాలతోనే విషజ్వరాలు సోకాయని కొందరు కాలనీవాసులు విచారం వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించిన వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరారు.

## మల్లన్న సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి రాజగోపురం వద్ద స్వాగతం పలుకుతున్న దేవస్థాన ఈఓ, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన వారికి ఆలయ రాజగోపురం వద్ద ఈఓ డి. పెద్దిరాజు, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ సంప్రదాయం ప్రకారంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీస్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు వేదాశీర్వచనంతో ఆశీర్వదించారు. ఈఓ స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

## వీధి దీపాల ఏర్పాటు



ఈశ్వర్‌నగర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీలో శనివారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. చిరుత సంచరిస్తుందనే సమాచారం మేరకు జేసీ రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సమయంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా సానుకూలంగా స్పందించారు. అలాగే అక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని ఆదేశించడంతో అధికారులు చిరుత సంచరించిన ప్రాంతాల్లోని కంపచెట్లు, చెత్తకుప్పలను తొలగించారు. అధికారులు మాట్లాడుతూ చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో చీకటి పడే వరకు రైతులు పొలాల్లో ఉండరాదని సూచించారు. కాలనీ ప్రజలు సైతం అత్యవసరమైతేనే బయటికి రావాలని కోరారు. వీఆర్‌ఓ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

### మల్లన్నకు నృత్య నీరాజనం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద వికారాబాద్‌కు చెందిన టి.పి.అనురాధ, బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమములో గణపతి ప్రార్థన, భో శంభో, మూషిక వాహన, మహిషాసురమర్దిని, వినాయక కౌత్వం, భో.. శంభో శివశంభో, జతిస్వరం, అదిగదిగో శ్రీశైలం, నటేశకౌత్వం తదితర గీతాలు, అష్టకాలకు నవ్య, సజన, శర్వాణి, వేద, వైష్ణవి, కావ్య తదితరులు నృత్యం చేశారు.

## ప్రకృతి ఒడిలో మహానందీశుడు



నల్లమల అడవిలో పచ్చటి చెట్ల మధ్య మహానంది ఆలయం

కొద్దిరోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలకు నల్లమల చిగురు తొడిగింది. దీంతో నల్లమల గిరులు పచ్చదనంతో అలరారుతున్నాయి. ప్రకృతి అందాల నడుమ మహానంది ఆలయ అందాలు అద్భుతంగా గోచరిస్తున్నాయి. ఈ సుందర దృశ్యాలు భక్తుల మదిని దోచేస్తున్నాయి. క్షేత్రంలో అడుగిడిన భక్తులు ప్రకృతి ఒడిలో ఉన్న ఆలయం, ఆహ్లాదకర వాతావరణానికి మంత్రముగ్దులవుతున్నారు. – మహానంది